సాక్షి పెద్దపల్లి

శనివారం ၊ 30 ၊ ఆగస్టు ၊ 2025

పచ్చందానికి పూలహారతి

కమాన్‌పూర్(మంథని): పొలాలను కప్పేసిన పచ్చని పైర్లు.. గుండారం రిజర్వాయర్ గట్టుపై రంగురంగుల పూలమొక్కలు.. అల్లంత దూరంలోని రామగిరి ఖిల్లాను ఆనుకుని ఆకాశం ఎత్తున ప్రయాణం సాగిస్తున్న మంచులాంటి మబ్బులు.. ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్న ఈ అద్భుతమైన చిత్రం 'సాక్షి' కెమెరాకు ఇలా చిక్కింది.



న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న స్వప్నరాణి

పెద్దపల్లిరూరల్: చట్టాలపై కనీస అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణి సూచించారు. జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర కాలేజీ హాస్టల్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు శ్రీనివాస్, భాను, సంకీర్తన, ఝాన్సీ, రమేశ్‌బాబు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి టెండరు పూర్తి



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

గోదావరిఖని: రామగుండంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.150 కోట్లతో టెండర్ ప్రక్రియ శుక్రవారం పూర్తయినట్లు అధికారులు సమాచారమిచ్చారని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మన రాష్ట్రానికి 50 వేల టన్నుల యూరియా కేటాయించేందుకు కేంద్రమంత్రులు అంగీకరించారని, ప్రస్తుతం 25వేల టన్నులు, వచ్చేనెల మరో 25వేల టన్నులు సరఫరా చేస్తారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, బోయిని మల్లేశ్‌యాదవ్, అనుమాస శ్రీనివాస్, కల్వల సంజీవ్, తిప్పారపు మధు, జావెద్, శ్రీధర్ పటేల్, సురేందర్ పాల్గొన్నారు.


ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా వాణిశ్రీ



వాణిశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిగా వాణిశ్రీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మెటర్నరీ హెల్త్, న్యూట్రిషన్ కో ఆర్డినేటర్‌గా వాణిశ్రీ పనిచేస్తున్నారు. ఇదే కార్యాలయంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అన్నప్రసన్నకుమారి అదనపు బాధ్యతలు రద్దు చేశారు.

కొనసాగుతున్న వరద



గోదావరికి పోటెత్తిన వరద

రామగుండం: శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టుకు వరద భారీగా వచ్చి చేరుతోంది. దీంతో శుక్రవారం 39 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.97 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి 5,00,245 క్యూసెక్కులు, కడెం నుంచి 27,648 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. గేట్లు ఎత్తి గోదావరిలోకి 7,13,538 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


ధ్యాన్‌చంద్ ఆశయ సాధనకు కృషి



నివాళి అర్పిస్తున్న డీవైఎస్‌వో సురేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ ఆశయ సాధనకు కృషి చేయాలని డీవైఎస్‌వో సురేశ్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ధ్యాన్‌చంద్ జయంతి ఘనంగా నిర్వహించారు. యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ అక్కపాక సురేశ్‌తో కలిసి సురేశ్ మాట్లాడారు. స్పోర్ట్స్‌క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, అంతర్జాతీయ బంగారు పతాక గ్రహీత గెల్లు మధుకర్‌యాదవ్, ఫిజికల్ డైరెక్టర్లు తాండ్ర ప్రణయ్, ఇక్బాల్, సత్యనారాయణ, రాజేశ్, అజ్జు, క్రీడాకారులు అమిరిశెట్టి రాకేశ్, సిద్ధం తిరుపతి, రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, నాయకురాలు జ్యోతి డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వరద.. వణుకు

- మనం సేఫేనా?
- గోదావరి.. మరోసారి ఉగ్రరూపం
- 'ఎల్లంపల్లి' నుంచి భారీగా వరద
- భయం గుప్పిట్లో లోతట్టు ప్రాంతాలు
- మూడేళ్ల క్రితంనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటున్న నగరవాసులు



వరద నీటిలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలు(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): గోదావరి బ్యాక్ వాటర్ అంటేనే.. లోతట్టు ప్రాంతప్రజలు భయంతో వణికిపోతున్నారు. మూడేళ్లక్రితం కురిసిన భారీవర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇప్పటికీ ఆ దృశ్యాలు కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. తాజాగా కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. అప్రమత్తమైన అధికారులు గురువారం ప్రాజెక్టు 40 గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరి నదిలోకి 8.20లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం వరకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. శుక్రవారం సాయంత్రం మళ్లీ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో మళ్లీ 40 గేట్ల ద్వారా 7.45 లక్షలను గోదావరి నదిలోకి విడుదల చేశామని అధికారులు తెలిపారు. వరద ఉధృతితో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది.

➡ వెంటాడుతున్న చేదుజ్ఞాపకం..

మూడేళ్ల క్రితం కురిసిన భారీవర్షాలతో రామగుండం నగరంలోని లోతట్టు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అప్పుడు దిగువన నిర్మించిన పార్వతీ బ్యారేజ్ గేట్లు మూసి ఉంచడంతో గోదావరి నదికి వరద పోటెత్తింది. బ్యాక్‌వాటర్‌లో గంగానగర్‌లోని రఘుపతిరావునగర్, మల్కాపూర్, రెడ్డికాలనీ, సప్తగిరికాలనీ, రాజలక్ష్మీ కాలనీతోపాటు మేడిపల్లిలోని చాలాకుటుంబాలు వరదలో చిక్కుకున్నాయి. పడవల ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది.

➡ నిత్యావసరాలకూ అవస్థలు..

ఇళ్లలోకి వరద వచ్చి చేరడంతో నిత్యావసరాలు, విలువైన వస్తు, సామగ్రి తడిసి ముద్దయ్యాయి. అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సమీపంలోని గురుకుల విద్యార్థులను షెల్టర్లకు తరలించారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, కంప్యూటర్లు, పుస్తకాలు నీళ్లల్లో తడిసిముద్దయ్యాయి. తాజాగా మల్కాపూర్ శివారులోని పొలాలు నీటమునిగాయి. రావూస్ పాఠశాల సమీపంలోని రహదారి వరకు వరద వచ్చి చేరింది. గంగానగర్‌లోని లారీ యార్డ్‌లోకి కూడా వరద రావడంతో లారీలను రోడ్డుపై పార్కింగ్ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పర్యటించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

➡ కొలిక్కిరాని గోదావరి తీరంపై కరకట్ట..

గోదావరి తీరం వెంట సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున కరకట్ట నిర్మించాల్సిన ప్రతిపాదనల అడుగు ముందుకు పడడం లేదు. కరకట్ట నిర్మిస్తే బ్యాక్ వాటర్ ముంపు తప్పుతుందని పలువురు వెల్లడిస్తున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా 9 లక్షలకుపైగా క్యూసెక్కుల వరద దిగువకు వదిలితే.. లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుందని అంచనాకు వస్తున్నారు.



వరద వెళ్లేందుకు వీలుగా నిర్మించిన పెద్ద కాలువ

ముందస్తు చర్యలు తీసుకున్నాం



బ్యాక్ వాటర్ ముంపు ముప్పును అధిగమించడానికి ముందుస్తు చర్యలు చేపట్టాం. అందుకే భారీవర్షాలు, వరదల్లో ఇప్పుడు రామగుండం సేఫ్‌గా ఉంది. నేను కూడా స్వయంగా పర్యటించా. ఎక్కడ కూడా బ్యాక్ వాటర్‌తో ప్రజలకు ఇబ్బంది లేదు. సుమారు రూ.70కోట్లు వెచ్చించి, వరద, మురుగునీరు సాఫీగా పారేలా మేజర్ నాలాలను అభివృద్ధి చేశాం.

– మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

పర్యవేక్షిస్తున్నాం



భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం. లోతట్టు ప్రాంతాలను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మల్కాపూర్ శివారులో కల్వర్టు వరకు వరద రాగా, ఆ ప్రాంతంతోపాటు పాములపేట వాసులను అప్రమత్తం చేశాం. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశాం. కరకట్టపై ఎస్టిమేషన్ తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరాం.

– అరుణశ్రీ, కమిషనర్, రామగుండం బల్దియా

ఆకస్మిక పర్యటన .. అనేక అంశాలు



ఎల్లంపల్లి ప్రాజెక్టు వరద ఉధృతిపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్(ఫైల్)

- ఆద్యంతం ఆసక్తిగా సాగిన ముఖ్యమంత్రి పర్యటన
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ శ్రేణుల దూకుడుకు అడ్డుకట్ట వేసే యోచన!

గోదావరిఖని: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించడం ఆద్యంతం ఆసక్తి రేపింది. భారీవర్షాలు, వరదల నేపథ్యంలో సీఎం రాక అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు.. వరదల ఉధృతిని తట్టుకుని అత్యంత పటిష్టంగా, మన్నికగా ఉందనే విషయాన్ని ఆయన రాష్ట్ర ప్రజలకు తెలియజెప్పినట్లయ్యింది. రూ.వేల కోట్లు వెచ్చించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు నాణ్యతా లోపంతో పనికి రాకుండా పోయాయనే సంకేతాలు ఇచ్చినట్లయ్యింది.

ఆసక్తి రేపిన ప్రసంగం..

తాము వేల పుస్తకాలు చదవలేదని, ప్రాక్టికల్‌గా పరిశీలించి ప్రాజెక్టు పరిస్థితి తెలుసుకుంటున్నామని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. సుమారు అర్ధగంట పాటు ప్రాజెక్టును పరిశీలించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ప్రాజెక్టు నిపుణులతో చాలాసేపు మాట్లాడా రు. వరద ఉధృతి, దానిద్వారా తలెత్తే అవరోధాలు, సమస్యలను ఎదుర్కొనే విధానాలపై ఇంజినీర్లతో చర్చించి పలు సూచనలూ చేశారు.

'ఎల్లంపల్లి' రాష్ట్రానికే గుండెకాయ..

ప్రజావసరాలు తీర్చుతున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు రాష్ట్రానికి గుండెకాయ అని సీఎం గుర్తుచేయడం ద్వారా ప్రాజెక్టు ప్రాధాన్యత మరోసారి తెరపైకి వచ్చింది. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా నేరుగా గోలివాడ పంప్‌హౌస్ వద్దకు చేరుకున్న సీఎం.. తొలుత గోదావరి వరద పరిస్థితిపైని హెలికాప్టర్ నుంచి పరిశీలించారు. ఆ తర్వాత హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం.. ముఖ్యకార్యకర్తల వద్దకు వెళ్లారు. వారితో కరచాలనం చేసి ఉత్సాహం నింపారు.

బీఆర్‌ఎస్ దూకుడుకు అడ్డుకట్ట..

భారీవర్షాలు, వరదల నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రాజెక్టుల నిర్మాణం గురించి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేసినట్లయ్యింది. అయితే, రాష్ట్రస్థాయి నాయకులు, ముఖ్యశ్రేణులు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో సీఎం ఆకస్మాత్తుగా వరద ప్రాంతాల్లో పర్యటించడం వెనుక బీఆర్‌ఎస్ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకేనని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీకన్నా ముందే బాధితుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం, అధికారులను అప్రమత్తం చేయడం, వరదల ఉధృతి పెరిగితే.. తలెత్తే పరిణామాలను అంచనా వేయడానికి సీఎం ఆకస్మిక పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది.

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం..

సీఎం రేవంత్‌రెడ్డి ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు సందర్శన జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. తొలుత సీఎం పర్యటన రద్దయ్యిందని ఎమ్మెల్యేకు సమాచారం అందించిన అధికారులు.. మళ్లీ పర్యటన ఖరారు చేస్తూ టూర్‌షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా గోలివాడ పంప్‌హౌస్ వద్దకు ఆగమేఘాలపై చేరుకున్నారు. సీఎం ఆకస్మిక పర్యటన కావడంతో ఎక్కువ మంది కాంగ్రెస్ శ్రేణులు హాజరుకాకపోయినా.. భారీవర్షాల నేపథ్యంలో తొలిసారి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సీఎం రావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

రైతులకు పరిహారం అందిస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



గణపతి హోమంలో మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: భారీవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. స్థానిక రావులచెరువుకట్ట గణేశ్ మండపంలో శుక్రవారం గణపతి హోమం నిర్వహించారు. పలు మండపాలను దర్శించుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వానికి శక్తినివ్వాలని ఆదిదేవున్ని వేడుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురికి రూ.కోటి ఇరవై ఒక లక్షల విలువైన సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మీ చెక్కులను మంత్రి కార్యాలయంలో పంపిణీ చేశారు. అంతకుముందు వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్స్ ప్రారంభించారు. ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే, ముస్కుల సురేందర్‌రెడ్డి, ఐలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

'పల్లె' ఓటర్ల సంఖ్య 4,04,209



ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని 263 పంచాయతీల్లో 4,04,209 మంది ఓటర్లు ఉన్నారని, అందులో మహిళా ఓటర్లు 2,05,451 మంది కాగా, పురుష ఓటర్లు 1,98,744 మంది ఉండగా.. మరో 14 మంది ఇతరులు ఉన్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యతో కలిసి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లాలోని పంచాయతీ పరిధిలో 2,432 వార్డుల్లో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీల వారీగా జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోగా ఎంపీడీవో కార్యాలయ అధికారులకు తెలపాలన్నారు. 31న అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న ఓటరు తుది జాబితాను ప్రచురిస్తామని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే విజయరమణారావు



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కుర్మపల్లిలో రూ.33లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏఈ లక్ష్మణ్, కార్యదర్శులు రజిత, ఝాన్సీ, సంతోష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చేపట్టిన 9 అదనపు గదుల నిర్మాణాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, హెచ్ఎం రత్నాకర్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంఈవో రాజయ్య, మున్సిపల్ కమిషనర్ రమేశ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో విజ్ఞానం.. క్రీడలతో ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో

జ్యోతినగర్(రామగుండం): విద్యతో విజ్ఞానం, క్రీడలతో ఆరోగ్యం లభిస్తుందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి రామగుండం(పాలకుర్తి–అంతర్గాం– రామగుండం ఈస్ట్ వెస్ట్) మండల జోన్‌స్థాయి టోర్నమెంట్, సెలక్షన్స్ పోటీలు నిర్వహించారు. తొలుత జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీఈవో మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారురాలు చికిత అంతర్జాతీయ వేదికపై మెరవడం మనజిల్లాకు గర్వకారణమన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, ఎంఈవోలు మల్లేశ్, విమల, ఏకాంబరం, పేట జిల్లా అధ్యక్షుడు సురేందర్, రమేశ్, రామగుండం జోనల్ కార్యదర్శి శోభారాణి, సోమశేఖర్, మాధవి, జావిద్, తిరుపతి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంలో అగ్రగామిగా రామగుండం

కోల్‌సిటీ/జ్యోతినగర్(రామగుండం): విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో రామగుండం నగరం అగ్రగామిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. నగరంలో రూ.6.16 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. రమేశ్‌నగర్, జవహర్‌నగర్, ద్వారకానగర్, ఎన్టీఆర్‌నగర్, కాకతీయనగర్, గణేశ్‌నగర్, అడ్డగుంటపల్లి, ఇందిరమ్మకాలనీ, అన్నపూర్ణకాలనీ, కృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ, మల్కాపూర్, ప్రశాంత్‌నగర్‌లో చేపట్టే యూజీడీ, గాంధీనగర్‌లోని గోశాల వెనుకాల చేపట్టే పండ్ల మార్కెట్ పనులు ఇందులో ఉన్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ.230 కోట్ల వ్యయంతో నగరంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ రూపుదిద్దుకోబోతుందన్నారు. ప్రతీ వీధిలో యూజీడీ నిర్మిస్తామన్నారు. గాంధీనగర్ 60 గ దులతో హోల్‌సేల్ పండ్ల మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న 7వేల మందికి కొత్తగా పట్టాలు అందిస్తామని అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ శివానంద్, ఈఈ రామన్ పాల్గొన్నారు.

యూరియా కష్టాలు

కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/ఓదెల(పెద్దపల్లి): రైతుల యూరియా కష్టాలు తీరడంలేదు. ప్యాక్స్‌లకు, ఇతర దుకాణాలకు స్టాక్ వచ్చిందని తెలియగానే తమ పనులు పక్కన పెట్టి ఉదయమే మండల కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం, ఎలిగేడు మండలం ధూళికట్ట, ఓదెల మండలం కొలనూర్‌లోని సింగిల్‌విండిల్లో రైతులు శుక్రవారం యూరియా కోసం ఉదయం నుంచే బారులు తీరి కనిపించారు.





ఎలిగేడు మండలం ధూళికట్టలో.. ఓదెల మండలం కొలనూర్‌లో రైతుల బారులు

పెద్దపల్లి-నిజామాబాద్ లైన్‌లో 'వందేభారత్'

- కామారెడ్డి ట్రాక్ రిపేర్ నేపథ్యంలో మళ్లింపు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: పెద్దపల్లి–నిజామాబాద్ లైన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోంది. రాత్రి 11 గంటలకు ఎగువన ఉదయం 4 గంటలకు దిగువన ఇదే మార్గంలో పెద్దపల్లి బైపాస్ మీదుగా నడుస్తోంది. ఇటీవలే ముంబయి నుంచి జాల్నా వరకు నడుస్తున్న 20706 వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును నాందేడ్ వరకు పొడిగించారు. కానీ.. ఈ రైలు ప్రాథమిక నిర్వహణ చర్లపల్లిలో చేస్తున్నారు. ఇది నాందేడ్ నుంచి చర్లపల్లి వరకు వయా నిజామాబాద్- కామారెడ్డి మార్గంలో ఖాళీ రైలుతో దిగువ వైపు, మళ్లీ వచ్చేటప్పుడు కూడా చర్లపల్లి నుంచి నాందేడ్ వరకు ఖాళీ రైలుతో నడుస్తుంది. రెండు రోజుల క్రితం కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు సమీపంలో పట్టాలు వరద నీటిలో కొట్టుకుపోవడంతో నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు స్తంభించాయి. ఫలితంగా ఈ మార్గంలో నడుస్తున్న పలు రైళ్లను నిజామాబాద్- పెద్దపల్లి బైపాస్–కాజీపేట మార్గంలో దారి మళ్లించి నడుపుతున్నారు. భవిష్యత్తులో ఈ మార్గం గుండా వందే భారత్, నమో భారత్ ర్యాపిడ్, అమృత్ భారత్ లాంటి రైళ్ల ప్రవేశ పెడితే ఈ ప్రాంత ప్రయాణికులకు మరింత సౌకర్యం కలిగే అవకాశం ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- యూరియా నిల్వలపై ఆరా



తనిఖీ చేస్తున్న ఏవో, విజిలెన్స్ అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో నిల్వఉన్న యూరియా లెక్కించి, రికార్డులతో పోల్చిచూశారు. యూరియా అమ్మకాలు ఈ పాస్ యంత్రం ద్వారా చేయాల్సి ఉన్నా.. ఎందుకు చేయడం లేదని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వరుణ్‌ప్రసాద్ వ్యాపారులను ప్రశ్నించారు. రైతుల ఆధార్ నంబరు నమోదు చేసుకుని అందిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. కాగా, నిబంధనలకు లోబడి ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి అలివేణి సూచించారు. సాగుకు మోతాదుకు మించి యూరియా వాడి నష్టపోవద్దని అన్నారు. నానో యూరియావాడకంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులు అవసరం లేకున్నా ఇంట్లో నిల్వ చేసుకోవద్దని ఆమె సూచించారు.

ఎలిగేడులో..

ఎలిగేడు(పెద్దపల్లి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, రాఘవేంద్ర ఫెర్టిలైజర్స్‌లో ప్రాంతీయ నిఘా, అమలు విభాగం కరీంనగర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వరుణ్ ప్రసాద్, ఏఈ శ్రీకాంత్ తనిఖీ చేశారు. లైసెన్స్, గోడౌన్, ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. రైతులకు యూరియా విక్రయించాలని, నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల వ్యవసాయాధికారి ఉమాపతి ఉన్నారు.

'గేట్లు ఎత్తినా పంట పొలాలు మునిగాయ్'



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: పార్వతీ బ్యారేజీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నా గోదావరి బ్యాక్‌వాటర్‌తో ఎగువన ఉన్న పంట పొలాలు నీట మునిగిపోయాయని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. పట్టణ సమీపంలోని గోదావరి వరద ప్రవాహాన్ని, నీట మునిగిన పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. బ్యారేజీలు వృథా అని, వాటినీళ్లతోనే పంట పొలాలు నీటమునిగి రైతులు నష్టపోతున్నారని మాట్లాడే వారు బ్యారేజీ గేట్లు ఎత్తి ఉన్నా ఒక్కచుక్క ఆపకుండా ఎలా మునిగిపోయాయో సమాధానం చెప్పాలన్నారు. ప్రాజెక్టును నీరుగార్చి ప్రజలకు అందుబాటులోకి రాకుండా చేశారని ఆయన మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ పారదర్శకంగా కట్టించిన కాళేశ్వరంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంటే మంథని ఎమ్మెల్యే కళ్లు మండిపోతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్, కేసీఆర్ పేరు చిరకాలం ఉంటుందనే కక్షతోనే కుట్ర లు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, నాయకులు తరగం శంకర్‌లాల్, పుప్పాల తిరుపతి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలు మృతి

గోదావరిఖని: ఎన్టీపీసీ ఖాజీపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి రాజమ్మ(72) మృతిచెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై అనూష తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక బస్టాండ్ సమీపంలో కిందపడి ఉండగా, 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. తలకు బలమైన గాయంతో మృతి చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారన్నారు. మృతురాలి కుమారుడు గుమ్మడి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన రాజమ్మ అనూహ్యంగా మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తలపగిలి తీవ్ర రక్తస్రావంతో మల్లేశం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి గంగాధర వెళ్లే డబుల్‌రోడ్డుపై తడగొండ కల్వర్టు పరిసరాల్లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన మల్లేశం తీవ్రంగా గాయపడడంతో పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు. బైక్‌పై గంగాధర మండలం కాసారం గ్రామానికి చెందిన ఒకరు, మరో బైక్‌పై ఇద్దరు గంగాధర వైపు వెళ్తున్నారు. కల్వర్టు పరిసరాల్లో వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో మల్లేశం తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు సైతం గాయపడ్డాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి మల్లేశంను ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య



పుష్పలత(ఫైల్)

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన ఓ వివాహిత అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన గూడ మాధవరెడ్డి భార్య పుష్పలత (64) కొంతకాలంగా పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రతతో జీవితంపై విరక్తి చెందిన పుష్పలత ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని వివరించారు. భర్త మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం బైక్ అదుపుతప్పడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. సిరిసిల్లకు చెందిన రాజకుమార్ పాత బస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వైపు వెళ్తున్నాడు. కోర్టు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తల, కాలుకు గాయాలయ్యాయి. స్పృహ తప్పి పడిపోయిన రాజకుమార్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జలకాలాట వద్దు!

- జలపాతాల ఉధృతితో జాగ్రత్తలే రక్ష
- ఎగువ నుంచి దిగువ మానేరు వరకు 60 కిలోమీటర్ల నది
- భారీగా ప్రవహిస్తున్న వరదకాలువ
- మిడ్‌మానేరు గేట్ల ద్వారా నీటి విడుదల



మిడ్‌మానేరు నీటి విడుదలతో మానేరు నది

బోయినపల్లి(చొప్పదండి): వరదలతో జిల్లాలో నదులు ఉప్పొంగుతున్నాయి. వరదకాల్వ నిండుగా ప్రవహిస్తుంది. ఇదే సమయంలో నదిని దాటే సాహసం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నీటి ప్రవాహం గురించి తెలియక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలో గోదావరి ఉపనది మానేరునది దాదాపు 60 కిలోమీటర్ల పరిధిలో ప్రవహిస్తోంది. ఈ నదిపై మిడ్‌మానేరు, ఎగువ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు నిర్మించారు. ఎగువమానేరు మత్తడి పోస్తుండగా, మిడ్‌మానేరు గేట్లు ఎత్తారు. దీంతో నదిప్రవాహం తీవ్రంగా ఉంది. ఎగువన వర్షాలు కుస్తుండడంతో ఏ క్షణాన నదుల ప్రవాహం పెరుగుతుందో తెలియడం లేదు. నిలకడగా నది ప్రవాహం ఉందనుకుని నది దాటే ప్రయత్నాలు చేస్తే వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో నది దాటలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న సంఘటనలు చూస్తున్నాము. ఎగువ మానేరు నది ప్రవాహం భారీగా పెరగడంతో వరదలో చిక్కుకున్న పలువురు హెలికాప్టర్ సాయంతో క్షేమంగా బయటపడ్డ సంఘటన గంభీరావుపేట మండలంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నదులు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గేట్లు ఎత్తడంతో నదుల్లో నీరు

భారీ వర్షాలతో ఎస్సారెస్పీతోపాటు మానేరు, మూలవాగుల నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలతో వరద కాలువ నిండుకుండలా మారింది. మిడ్‌మానేరులో 23 టీఎంసీల మేర నీరు చేరింది. మిడ్‌మానేరు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి నీరు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరు గేట్ల ద్వారా నీరు వదలడంతో మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీ వరకు 20 కిలోమీటర్ల మేర మానేరు నది భారీగా ప్రవహిస్తోంది. నేడో, రేపో ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో ఎల్‌ఎండీ నది ప్రాంతంలో సైతం వరద ప్రవాహం పెరుగుతుంది. ఈ సమయంలో వరదలో చిక్కి ఇబ్బందులు పడకూడదు.

వరద జాగ్రత్తలు ఇవీ..

- ప్రాజెక్టుల సందర్శించే సమయంలో వరదకు దగ్గరగా, దరుల వద్దకు పోవద్దు.
- ప్రాజెక్టుల వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే విషయంలో పరిసరాలు చూసుకోవాలి.
- గేట్ల ద్వారా నీరు విడుదల అవుతున్న సమయంలో దూరంగా ఉండాలి.
- వంతెనలపై నుంచి కింద పారుతున్న జలాలను రక్షణ గోడల వద్ద నుంచి చూడాలి. చిన్న రక్షణ గోడలు ఎక్కి చూస్తే నీటిలో పడే ప్రమాదం ఉంది.
- కాజ్‌వేలు, కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా వెళ్తున్న క్రమంలో వాహనాలతో వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- చెరువుల కట్టలపై, అలుగుల వద్ద వాహనాలు నడవడం, సర్కస్ ఫీట్లు చేయవద్దు.
- చెరువులు, వాగుల్లో ఈత కొట్టవద్దు.



భారీగా ప్రవహిస్తున్న వరద కాలువ

మానీటితో రైతుల వ్యవసాయం

జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో విస్తరించి ఉన్న వరదకాలువ ఆధారంగా రైతులు వేల ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. వరదకాలువ, మానేరునది పరిసరాల్లో మోటార్లు అమర్చుకుని పైపులైన్ల ద్వారా పొలాలు పారిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. వీరంతా వరద ప్రవాహం ఉన్న సమయంలో నీళ్లలోకి వెళ్లడం ప్రమాదకరమని అధికారులు చెబుతున్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ప్రాంతంలో రైతులు వరద ప్రవాహం లేదనుకుని వెళ్లిన తర్వాత ఒక్కసారిగా వరద రావడంతో చిక్కుకుని అవస్థలు పడ్డారు.

బయటకు వెళ్లవద్దు



వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. పశువులను, గొర్రెలు, మేకలు మేపడానికి వెళ్లవద్దు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కంట్రోల్ రూమ్ సేవలు వినియోగించుకోవాలి. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 18002331495కు సమాచారం ఇవ్వాలి.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

అందుబాటులో పోలీసులు



మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రవహిస్తున్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఎవరైన ఆపదలో ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి. 100 నంబర్‌కు కాల్ చేయాలి.

– మహేశ్ బి గీతే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవశిక్ష

జగిత్యాలజోన్: భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్నపద్మావతి శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన అరిపెల్లి సత్తయ్య–లక్ష్మి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు కాగా, మొదటి కుమారుడు అరిపెల్లి కృష్ణ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. రెండో కుమారుడు అరిపెల్లి వినోద్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కుమారులిద్దరూ ఇక్కడ లేకపోవడంతో, వారి భార్యలు వారివారి పుట్టింట్లో ఉంటున్నారు. సత్తయ్య ఏ పని చేయకపోవడమే కాకుండా, ప్రతి చిన్న విషయానికి ఇంట్లో వాళ్లను తిడుతుండేవాడు. సత్తయ్య–లక్ష్మి మధ్య ఎప్పుడు గొడవలు జరిగేవి. దీంతో భార్యాభర్తలు ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉన్నారు. కాగా లక్ష్మి తన వైపు కాకుండా, తన కుమారుల వైపు మాట్లాడుతుందని, భార్యపై ప్రతిసారి కోపడుతుండేవాడు. చంపేస్తానని భార్యను బెదిరించడంతో లక్ష్మి మరో చోట ఇల్లు అద్దెకు తీసుకుంది. అక్కడకు వెళ్లి కూడా సత్తయ్య నానా హంగామా సృష్టించేవాడు. ఈ నేపథ్యంలో, ఆగస్టు 8, 2020న చిన్న విషయానికి గొడవపడి, లక్ష్మిని పదునైన కత్తితో గొంతుకోయడంతో మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కొడుకు వినోద్ రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ఆరోగ్యం కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె.నరేశ్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో, జడ్జి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు సత్తయ్యకు యావజ్జీవశిక్ష, జరిమానా విధించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన భీమయ్య, ధర్మయ్యకు చెందిన రెండు ఇళ్లలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిత్యావసర సామగ్రి కోసం ఆర్థికసాయం అందించారు. రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందేలా నివేదిక తయారుచేయాలన్నారు.

లోన్ మంజూరైందని రూ.1.50లక్షలు టోకరా

జమ్మికుంట: ముద్ర లోన్ మంజూరైందని, అందుకు డబ్బులు కట్టాలని వాట్సాప్ లింక్ ద్వారా రూ.1.50లక్షలు కాజేసిన సంఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన కడిపికొండ శివరెడ్డి అనే వ్యక్తికి ముద్ర లోన్ మంజూరైందని వాట్సాప్ లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా.. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలోని రూ.1.50లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి పది నెలల జైలు

మెట్‌పల్లి(కోరుట్ల): అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన దుంపటి లక్ష్మీరాజ్యంకు మెట్‌పల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ పది నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన రాజుల సాయన్న 2020 ఫిబ్రవరి 25న తన ఆటోలో మేడిపల్లికి వెళ్లి అక్కడ రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో అటు వైపు కారులో లక్ష్మీరాజ్యం అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సాయన్న తర్వాత చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి సీఐ ఎల్.శ్రీను, ఎస్సై అశోక్ పకడ్బందీ సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. వాటిని మెజిస్ట్రేట్ పరిశీలించి నిందితుడికి జైలుశిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అనుమతివ్వండి

మల్లాపూర్(కోరుట్ల): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని, ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వాలని బాధితులు వేడుకున్న ఘటన మల్లాపూర్ మండలం మొగిలిపేటలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓడెల గజానంద్–సరోజన దంపతుల ఇళ్లు శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఆ ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి, ఫొటో క్యాప్చర్ కోసం పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా, ఇంటి నిర్మాణ స్థలంపై ఫిర్యాదు వచ్చిందని, ఆ వివాదం పరిష్కారమయ్యే వరకు అనుమతితో పాటు ఫొటో క్యాప్చర్ తీయలేనని సమాధానమివ్వడంతో బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే భాగ్యం లేదా అంటూ బాధితులు నిరసన తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సౌజన్యను వివరణ కోరగా, ఓడెల సరోజన–గజానంద్ దంపతులు నిర్మించుకుంటున్న ఇంటి వెనుక వారితో దారి వివాదం ఉందని తెలిపారు. వివాదం పరిష్కరించుకొని అనుమతి కోసం రావాలని బాధితులకు సూచించామని పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న సరోజన-గజానంద్



మిడ్‌మానేరు వద్ద సెల్ఫీ దిగుతున్న యువకులు



చేపలు పడుతున్న మత్స్యకారులు

మధ్యమానేరు పరవళ్లు

వరుసగా కురుస్తున్న వర్షాలతో మిడ్‌మానేరు ఏడు గేట్లు ఎత్తి ఎల్‌ఎండీలోకి నీటిని వదులుతున్నారు. జలప్రవాహాన్ని చూసేందుకు వస్తున్న జనం సరదాగా సెల్ఫీలు దిగుతుండగా.. మత్స్యకారులు జీవనోపాధి కోసం అదే వరదలో చేపలు పడుతున్నారు. ఇదే వరదతో గంభీరావుపేట మండలంలో వరిపొలాలు కొట్టుకుపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోరుట్లరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన కొయ్యాడ అనిల్ (33) మృతదేహం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శివారు కెనాల్‌లో శుక్రవారం సాయంత్రం లభ్యమైనట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనిల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. పని చేయలేని పరిపస్థితుల్లో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక క్షోభకు గురవుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటినుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం సాయంత్రం పెద్దాపూర్ శివారు కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. కాగా, తన భర్త ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతూ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పార్వతీ బ్యారేజీకి తగ్గని వరద



బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద

మంథనిరూరల్: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీకు వరద తాకిడి తగ్గలేదు. శుక్రవారం సైతం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 8.28లక్షల క్యూసెక్కులు వస్తున్నాయి. పార్వతీ బ్యారేజీ 74 గేట్లు ఎత్తి ఎగువ నుంచి వచ్చే నీళ్లను దిగువకు వదులుతున్నారు. బ్యారేజీలో ప్రస్తుతం 125.780 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి ఇప్పటివరకు ఒకేస్థాయిలో వరద కొనసాగుతుండటంతో పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగే ఉన్నాయి. వరద ఉధృతి తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వరద ఉధృతి అలాగే కొనసాగుతుండటంతో అధికారులు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనాల పట్టివేత



సీఐఎస్ఎఫ్ అధికారులు పట్టుకున్న వాహనాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ టౌన్‌షిప్ నుంచి అక్రమంగా తరలిస్తున్న స్క్రాప్‌ను సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రెండు ట్రాక్టర్ల ద్వారా గురువారం ముగ్గురు స్క్రాప్ తరలిస్తున్నారని సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు.. ప్లాంట్ నుంచి వచ్చిన ట్రాక్టర్, హైడ్రా వాహనాలను నిలిపి తనిఖీ చేయగా సుమారు 170 కేజీల స్క్రాప్ లభించింది. ఈమేరకు ట్రాక్టర్ డ్రైవర్ ఎ.సతీశ్, హైడ్రా డ్రైవర్ గుడ్డు కుమార్‌సింగ్, క్రేన్ ఆపరేటర్ కబీర్ అన్సారీని అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఎన్టీపీసీ హెచ్ఆర్ అధికారులకు స్క్రాప్ అప్పగించారు.

కొదురుపాకలో రెండిళ్లలో చోరీ

- బంగారు, వెండి నగలు అపహరణ



బీరువాలో చిందర వందరగా వస్తువులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకలో గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో జరిగిన చోరీలో బంగారు, వెండి నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. కొదురుపాకకు చెందిన నాగుల లక్ష్మీరాజం, ధ్యావనపల్లి సుధాకర్‌రావు ఇళ్లలో దొంగలు చొరబడ్డారు. నాగుల లక్ష్మీరాజం ఇంట్లో 30 తులాల వెండి పట్టీలు, ధ్యావనపల్లి సుధాకర్‌రావు ఇంట్లో తులం బంగారుగుండ్లు, అర తులం కమ్మల జతలు, 20 తులల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీంతో వివరాలు సేకరించారు.

కాళ్లకు ఇన్‌ఫెక్షన్.. వైద్యం కోసం నిరీక్షణ

- ఆపరేషన్‌కు రూ.14లక్షలు అవసరం
- చికిత్స చేయించలేక.. నిమ్స్ వరండాలో కుటుంబ సభ్యులు
- దాతల సాయం కోసం వేడుకోలు



నిమ్స్ వరండాలో ఉన్న పేషెంట్, కుటుంబ సభ్యులు

జూలపల్లి(పెద్దపల్లి): ఖరీదైన వైద్యం చేయించుకునే స్తోమతలేని ఓ పేద కుటుంబం ఆపన్నహస్తం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ వరండాలో తలదాచుకుంది. దాతల సాయం కోసం దీనంగా ఎదురు చూస్తోంది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పులిపాక నర్సయ్య రెండు కాళ్లకు ఇటీవల ఇన్‌ఫెక్షన్ సోకింది. స్థానికంగా వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. రెండుకాళ్లకు ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం సుమారు రూ.14 లక్షల వరకు ఖర్చవుతుందని వెల్లడించారు. చేతిలో చిల్లిగవ్వలేని బాధిత కుటుంబం.. తొలుత పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50లక్షలు ఇచ్చేందుకు ఉత్తర్వులు మంజూరు చేయించారు. మిగతా డబ్బుల కోసం బాధిత కుటుంబం దాతల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తోంది. ప్రస్తుతం చికిత్స ఏమీ లేకపోవడంతో నిమ్స్ వరండాలోనే కాలం వెళ్లదీస్తోంది. సకాలంలో ఆపరేషన్ చేయకుంటే రెండుకాళ్లు తొలగించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దాతలు ముందుకు రావాలని వారు వేడుకుంటున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు

- నిల్వ పదార్థాలు గుర్తింపు



నిల్వ ఉన్న ఆహార పదార్థాలు

కరీంనగర్ అర్బన్: ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. బస్టాండ్ పక్కన గల నటరాజ్ బార్, దర్బార్ బార్‌లో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.రోహిత్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.అంకిత్‌రెడ్డి తనిఖీలను నిర్వహించారు. దర్బార్ బార్‌లో ముందు రోజు మిగిలిన మటన్, కార్న్, వెజ్ మంచూరియాను గుర్తించారు. హైజీన్ లోపాలు గుర్తించగా నోటీసులు జారీ చేశారు. అలాగే నటరాజ్ బార్‌లో పరిసరాల పరిస్థితి అధ్వానంగా ఉన్నట్లు గుర్తించామని అధికారులు వివరించారు. కిచెన్ దుర్వాసన రాగా, సిబ్బంది ఎటువంటి ఆహార భద్రత జాగ్రత్తలు పాటించకపోవడంతో నోటీస్ జారీ చేసినట్లు వివరించారు.





రాజన్నకు మొక్కులు

వేములవాడ : రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.16లక్షల ఆదాయం సమకూరింది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాజన్నను దర్శించుకున్నారు. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్, కల్యాణకట్ట, మెయిన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, వెల్ది సంతోష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నూగురి నరేందర్ ఉన్నారు.

స్పటిక లింగాలతో వినాయకుడు

విఘ్నాలు హరించే వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో 36వ వార్డు వెంకంపేట రాంలాల్ మండప్ నిర్వాహకులు స్పటిక లింగాలతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో కోల్‌కత కళాకారులతో రూ.2 లక్షలకు పైగా వెచ్చించి ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. పర్యావరణానికి హాని కలుగకుండా పూర్తిగ బంకమట్టి, కర్రలు, గడ్డితో ఎలాంటి రసాయనాలు వాడకుండా ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. 10,116 స్పటిక లింగాలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



స్పటిక లింగాల వినాయకుడు